**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com


విజయవాడ,

తేది : 15 నవంబర్, 2020.

**గౌ॥ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు గారికి,**
**ఆంధ్రప్రదేశ్,**
**విజయవాడ.**

**ప్రచురణార్థం:** సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు వారికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాం. **– జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి

**విషయం : చిత్తూరు జిల్లా యనమలమంద దళితులపట్ల చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తున్న పోలీసు అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ...**

ఆర్యా!

చిత్తూరు జిల్లా, వెదురుకుప్పం మండలం, యనమలమంద దళిత వాడకు చెందిన దళితులపై దాడిచేసి గాయపరచిన ఎస్.ఐ. లోకేష్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.

ఎం.మల్లిక అనే మైనర్ బాలికకు అక్టోబర్ 30న పెండ్లి చేసారని వచ్చిన ఫిర్యాదుపై దళిత వాడకు వెళ్ళిన ఎస్.ఐ.లోకేష్ రెడ్డి ఎం.మల్లికను విచారించారు. మల్లిక అటువంటిది ఏమీ లేదని చెప్పినప్పటికీ మల్లిక మేనమామ బాబును విచారణ పేరుతో తీసుకువెళ్ళి ఎస్.ఐ. కొట్టిన దెబ్బలకు బాబు చెవిలోనుండి రక్తం వచ్చింది. జరిగిన అన్యాయాన్ని అడగడానికి దళిత వాడ ప్రజలు గాయపడిన బాబును తీసుకొని అక్టోబర్ 31న పోలీస్‌స్టేషన్ ముందు రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పుత్తూరు డి.ఎస్.పి, కార్వేటినగరం సి.ఐ.లు స్టేషన్ వద్దకు చేరుకొని నిరసన చేస్తున్న వారితో చర్చలు జరిపి ఎస్.ఐ కొత్తగా వచ్చాడని, తెలియక తప్పు చేసాడని, అతనిపై శాఖా పరంగా చర్య తీసుకుంటామని దళితులకు హామీ ఇచ్చారు. దెబ్బలుతో వున్న బాబును పోలీసులే పుత్తూరు ఆసుపత్రిలో చేర్పించారు. న్యాయం చేస్తామని డిఎస్‌పి హామీ ఇవ్వడంతో దళితులు తమ నిరసనను ఉపసంహరించుకున్నారు.

బాధితులను పరామర్శించడానికి వెళ్ళిన వామపక్ష, దళిత సంఘాల నాయకులకు కూడా డిఎస్‌పి ఇదే విషయాన్ని తెలియజేశారు. అది మీడియాలో కూడా వచ్చింది. కానీ డిఎస్‌పి హామీకి భిన్నంగా 24 గంటలు గడవక ముందే అక్టోబర్ 31వ తేది రాత్రి పోలీసులు దళిత వాడ మీద దాడి చేసి భయభ్రాంతులకు గురి చేయడంతో దళితులు ఇళ్ళను వదలి వివిధ ప్రాంతాలకు పారిపోయారు. నవంబర్ 1న 23 మందిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. వీరిలో పసిపిల్లలు, మహిళలు ఉన్నారు. బాల్య వివాహం చేసారని, పోలీస్ స్టేషన్ మీద దాడి చేసి, ప్రభుత్వ ఆస్థులను ధ్వంసం చేసారని వివిధ సెక్షన్ల కింద 80 మంది దళితులపై రెండు కేసులు నమోదు చేసారు.

మెరుగైన వైద్యం కోసం బాబు జిల్లా ఆసుపత్రి చిత్తూరులో చేరాడు. బాబు స్టేట్‌మెంటు ఆధారంగా ఎంఎల్‌సి నమోదు చేసినా ఎస్.ఐ మీద ఎటువంటి కేసు నమోదు చేయలేదు. దళిత సంఘాలు, వామపక్షాలు బాధితులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్, ఎస్‌పిలకు జరిగిన వాస్తవాలను తెలిపినప్పటికీ ఎటువంటి స్పందన రాలేదు. పైగా ఈ ఘటన నుండి ఎస్.ఐ.ని రక్షించడానికి పోలీసులు బాబును భయపెట్టి తనను ఎస్.ఐ కొట్టలేదని బలవంతంగా పేపర్ స్టేట్‌మెంట్ ఇప్పించారు. ఒక దళితుడు, పైగా ఉప ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే దళితులకు రక్షణ లేకుండా పోయింది. పోలీసులు వాస్తవాలను తారుమారు చేయడానికి పూనుకున్నారు.

అందువల్ల జరిగిన ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని, దళితులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, బాబుపై ఒత్తిడి చేస్తున్న అధికారులపై, ఘటనకు కారణమైన ఎస్.ఐపైన తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.

**అభివందనములతో...**

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి